# ఎవుడి ఏడుపు వాళ్లది...

"ఇంట్లో కాలు నిలబడకుండా యిల్లామల్లి తిరుగుళ్లు తిరిగేసి గదమ్మా నేను యింటికాడి కొచ్చింది. బయట ఎట్లుండాదని ఎన్నెల? నెవురేస్తా ఉండాది. ఆ ఎన్నిట్లోనే నిక్కతా నీలగతా తిరిగేసి వచ్చినాననుకో. తాగేదానికి నామొకానన్ని మంచినీళ్లు కొట్టమ్మా అని అడిగినాననుకో. అయినా యింత చల్లంగా తెచ్చిస్తే ఎట్టమ్మా తాగేది?''

ఎట్టయినా ఏమ్మేదాకా చదువుకుణ్ణె బిడ్డగదా? ఈ వానాకాలం చదువులోడి ఎత్తిపొడుపును బాగా అర్థంచేసు కుణ్ణెట్టుండాది. అయినా అంత ఎకిసికంగా మాట్లాడ్తావుంటే ఏం బొదులు చెప్తింది? బొదులు పలకలేక నామొకంలోకి చూళ్లేక తలకాయ వాలేసింది. ఎడంకాలి బొట్నేలు మాత్రం నేలమింద ఏదో గీతలు గీస్తా ఉండాది.

బయట ఎండ ఎట్లుండాదని? చెండి కొడ్తావుండాది. సెగలు శాటల్తో ఎత్తి పోస్తా ఉణ్ణెట్లుండాది. ''ఇదేందిరా తండ్రీ! ఈ తిరపతిలో ఎప్పుడూలేదే? ఇదేమి ఎండబ్బా యిది? ఇపరీతకాలానికి ముంతకు కాళ్లొచ్చినట్లుండాదే బతుకు. వాటంవైనం రొండూ లేకుండా కట్టినకొంపలు. ఈకొంపల్లో ఎట్టపడి చావాల్నో?'' అంటా జనం ఆపసోపాలు పడ్తావుండారు.

అటుమంటి ఎండలో నాతిప్పలు కుక్కలకెరిక. కాలికి కాలు కొట్టుకుంటా తొక్కని గడప లేనే లేదురా తండ్రీ అన్నెట్లుగా తొక్కితి. నోరుతెరిసి అడగనోడు పాపాత్తుడన్నెట్లుగా అడిగితి. ఆ పూటకు ఎసుట్లోకి కాకపాయ్‌నా ఏదో వొకపని అయిందనిపించుకోని కొంపకొస్తే గొంతు కాలే నీళ్లతెచ్చి నా ఎదానకొడ్తే నేనేంచెయ్యాల? కడుపు రగలమంటే రగలదా? నాకే కాదు. ఎవుడికైనా రగిల్తింది. రగిల్తే ఏమయితింది? పొగలేస్తింది. లేసిన పొగ మాటలుగా మార్తే అద్దో దాని వరస యిద్దో యిట్టామాదిర్తో ఉంటింది.

ఎమ్మే చదివిన బిడ్డ అట్టాయిట్టా పోలేకుండా ఆణ్ణే నిలబడుకోనుండాది. గోరెచ్చంగా ఉండే నీళ్లు గొంతులోకి పోలేకుండా ఎకసెకం చేస్తావుండాయి. లోపల ఉండేనీళ్లు ఎట్టాస్తా ఉండాయో వొళ్లంతా తడ్సి ముద్దముద్దయి పోతావుండాది.

అప్పుడు ఈదినాటకంలో యిలన్ మాదిర మా బాశాలి యిర్సక పడె.

''యదవ!... యదవ! వాణి మొకాన మజ్జిగ పుల్సు కొట్టా. చిన్న బిడ్డె మాదిర్తో యింటి చుట్టూ పెళ్లచుట్టూ ఒక్క మోపన తిరిగె. నీ దగ్గిర పనిచెయ్‌పించుకుండే దాకా వొంటి కాలిమింద నిలబడె. కొత్త ఫ్రిజ్ కొనుక్కోనొచ్చి యింట్లో పెడ్తానని కూతకూసె. పనైపోతానే నీ యబ్బ నాకేం కావాలని మొరిగె. ఈ మొగోడు యింట్లో చూపించే యారాపు ఈదిలో చూపిస్తే గదా? ఇద్దో యిట్టా ఏరుదాటి తెప్పగాల్చేసే యదవల కత యిడ్సిపెటేసి యింట్లో వాళ్లమింద పడి మొత్తుకుంటే ఎత్తుబారంమొత్తుకోళ్లే కధా?''

''ఎంత మొత్తుకుణ్ణా అక్కొండక పోతావుంటేగూడా సల్లంగా గుక్కెడు మంచినీళ్లు గొంతులో పడవు.''

''తెల్సు గదా? మల్లా ఎందుకీ రామాయిణమంతా?''

''బుద్ధి గెడ్డి తిని!''

''గెడ్డి తినే గొడ్లు మేలు గదా? వొంటిమింద ఒక్క దెబ్బ పడ్తే చెప్పినట్టు యింటాయి. ఈ మణసల కత అట్టా కాకపాయ్‌నే?''

''అప్పిటికి నేను గొడ్లకంటే గూడా అన్యాయమనా నువ్వనేది?''

''రామ! రామ! అంత మాటంటే అందులో మీ మొగజాతిని! – కండ్లు కనపడ్తాయా?''

''ఎప్పుడు నిద్దర పొయ్యేటప్పుడా?''

''ఇద్దో యిట్టా ముడ్డికి కాటిక పెట్నెట్టు మాట్లాడమంటే ఏం తక్కవ లేదమ్మా? ఫ్రిజ్ లేకుండాబోతే పీడాగిటి పొయ్యింది. ఒక కొత్త కుండొకటి దెచ్చి కొంపలోకొత్తే?''

''కొత్తే కుండ పగిలిపోతిందే''

''ఆడికి నిలిపే నీవగలు. ఆహా! చెళ్ల చెన్న పట్నందాకా పోతావుండాదే మొగోడికి. అయినా నేనూ చూస్తానేవుండా. ఈ కొంప మట్టసం ఏంపాడోగానీ ఎప్పుడూ ఏదో ఒక రంపు! అది కొత్తకుండ మిందనో లేకుండాపోతే ఒక బేవార్సముండ మిందనో రంపు రగలబడి పోతావుండాల్సిందే. ఎండ ఎట్టా అగ్గిబడి పోతావుండాది. కొత్తకుండలో నీళ్లు చల్లంగా వుంటాయని యివరించి చెప్పాల్నా? ఆ మాత్రం నేర్వరా? పోనీ! ఎట్టా తబిల్లో పోసిపెట్టే నీళ్లు కడవలోపోసి పెట్టేదానికి నాకేమన్నా కష్టమా?''

''ఒరే మొగోడా! ఫ్రిజ్ తేకుండాపోతే పాయ్‌నావు. నీ మొకానికి ఆ బయిసి కూడానా? ఒక కొత్తకుండన్నా తెచ్చి కొంపలోకొత్రా'' అని మాబాశాలి చెప్పకనే చెప్పేకుండికి

ఆ పొద్దు పొద్దుగూట్లో పడేలోగా ఆరునూరు గానీ నూరారుగానీ కొత్త కడవ కొనుక్కోని రావాల్సిందే! అని తీరుమానం చేసుకుణ్ణా.

మా అయ్య బతికి వుణ్ణంత కాలం ఒక మాట పాట మాదిర్తో పాడ్తా వుండె. 'పాలుమార్తివా? బయిశార్తివా' అని. అప్పుడనంగానే ఆ మాట గుర్తుకొచ్చె. కొంపలో ఎట్టా బయిసి ఆరి పోనే పొయ్యింది. ఇప్పుడుమల్లా పాలు మారి వుండే బయిసి గూడా ఆర్సుకుండేదెందుకని ఎండనపడి వచ్చినమాటే మర్సిపోతి. కొత్తకడవ కొనుక్కోని తెచ్చి ఆడపారేస్తే పోతిందని ఎకా ఎకిని ఎలబార్తి.

కొత్తకుండే గాదు కొత్తకోక వొగిటి కొనుక్కోవాలన్నా కడాన చింతనీళ్లల్లోకి నాలుగు కొత్తిమిరిపోసలు కావాలనుకుణ్ణా ఈఊళ్లో గాందీరోడ్డే గెతి!

ఈఊళ్లో గాందీరోడ్డు మాటెత్తితే వొళ్లు జిలపరిస్తింది.

మిడిమిల కిందికి పంచెలుగట్టి మోకాళ్ల కిందికి జుబ్బాలేసే మొనగాళ్లు శానామంది ఉండారు ఈ ఊళ్లో. అయినా ఆ రోడ్డు కత పట్టించుకోరే. ఎవురు చెప్పినా ఎంత చెప్పినా దున్నపోతు మింద వానకుర్సినట్టే! ఆ రోడ్లోకి పోవాలంటే నాలుగ్గాళ్లమండపాన్ని దాటుకోని పోవాల్నా? ఆదోవన ఎవురో ఒకరు తగల్తారా? తగిల్తే యింకేం వుండాది? కడవకత కడవదే? మనకత మనదే! అందుకనే రూటు మార్సేసినా!

గాందీరోడ్లో మార్కెట్టుకాడికి పొయ్‌నా. సరిగ్గా ఆ మార్కెట్టుకు ఎదురుంగా ఎవుడో ఒకడు రకరకాల కుండలు ముందర పర్సిపెట్టుకోని ఈగిలు తోలుకుంటా కూసోనుండాడు. వాడి దగ్గిరికి పొయ్‌నా. సుమారు పాటి కడవొగిటి చేతికందుకుణ్ణా.

''ఎంతరా అబ్బోడా!'' అని అడిగినా.

వాడు ఎనుకూ ముందూ చూడకుండా-

''తే ఏడురూపాయిలు.'' అనె.

నేను ఎగిరట్టా పడ్తి. అయినా సమాళించుకోని-

''ఇది మట్టి కడవరా అబ్బోడా!'' అంటే-

''కాదు కాదు. బంగార్ది గదా? అందుకే అంత రేటు.''

''ఏం పడాసకం పడ్తావుండావా?''

''నువ్వా నేనా? లేకుండాబోతే ఏందయ్యా నువ్వనేది? మట్టికుండలు గాకుండా బంగారు కుండలో వెండి కుండలో అమ్ముకునేటట్టుగా ఉంటే ఈ ఎర్రని ఎండలో యిద్దో ఈ ఫ్లాట్‌పారం మింద యిట్టా పడుండే దానికి నాకేమన్నా గాచ్చారం అనుకుణ్ణావా?''

అంత ఎండలో గూడా నా వొళ్లు చల్లబడె!

నోట మాట రాకుండా రెప్పట్టా ఆర్సకుండా వాడికల్లానే చూస్తా నిలబడుకోనుంటే-

''కుండలమ్మ కుండే కుండాకోర్ యదవకు యింత తిమురా? అని అనుకో బాకండయ్యా. మీకొక దణ్ణం పెడ్తా. ఏం చెయ్ మంటారో చెప్పండి. ఈ నాలుగు దినాలు అట్టా గడ్సిపోతే మల్లా కుండకల్లా చూసే నీ కొడుకు ఎవుడుంటాడో చెప్పండి. మల్లా ఎండాకాలం వొచ్చేదాకా వొళ్లో చేతులు పెట్టుకోని ఎదుర్సూస్తా కూసోవాల్సిందే గదా? మా బతుకులు ఉండాయే? అట్టా దోవకూడు యిట్టా యింటి కూడు దేనికీ కాకుండా పాయ.''

మారు పలక్కుండా వాడు అడిగినంత యిచ్చేసినా.

నిజిం చెప్పొద్దూ! కొత్త కుండలో నీళ్లు తాగిన నిమ్మతి వాడి మొకంలో అవుపించె.

నా మణుసూ నిమ్మతి పడె!

వాడు సెరామని పైకి లేసె. ఒక్కొక్క కడవగా చేతికెత్తుకుండె. అట్టా యిట్టా తిప్పించి మల్లించి చూసె. ఎడమ చేతి అరిచేతిలో పెట్టుకుండె. కుడి చేతి నడిమేలు మడిచి రొండు దెబ్బలేసె. టంగ్ టంగ్‌మని బాగా పలకతా వుండే కడవ వొగిటెత్తి నా చేతికిచ్చె!

ఇంక నేను ఆ కడవ నెత్తుకోని గాందీ రోడ్లో నడ్సిరావాల!

''ఇదేందిరా నా తండ్రీ! బతినంత బతుకూ బతికి కడాన యింటి ఎనక చచ్చి నట్టాయనే బతుకు!'' అని యాదనపడ్తా అట్టా యిట్టా చూసి ఒకరిక్సాను పిలిస్తి. వాడు వొగిటేపారిగా రొండు రాపాయిలు అడిగె.

''నాలుగుబార్లే గదరా?'' అంటే-

''నాలుగుబార్లో నలబై బార్లో నాకు తెల్దు. అట్టా ఎక్కి దిగితే చాలు. రొండు రాపాయిలు యిచ్చేయాల్సిందే. అదే ఆటో ఎక్కితే? - యిదంతా అడగతారా?''

వాడికి తెల్సిన రూలు వాడు మాట్లాడె!

ఈ కొత్త కుండతో. యాపాడం బాగుండాదే? మూడు కాసుల కోతి ముక్కాలణా బెల్లం తిన్నె కతగా ఉండాదే నాకత. ఇప్పుడు ఏం చెయ్యాల్రా దేముడా? అని దిక్కులు చూస్తా నిలబడుకోని ఉండా.

ఎవురో ! 'ఒరే అల్లుడా!' అని పిల్సినట్టుంటే అట్టా యిట్టా చూస్తి.

ఎదురుంగా కుమ్మర పుల్లన్న!

''ఒరే అల్లుడా! ఈ పొద్దు వస్తా వస్తా నక్క మొకం చూసి వచ్చినాననుకో. లేకుండా పోతే ఈ ఊళ్లో యాడేడ తిరగాల్నో? ఎవురెవర్ని అడగాల్నో? ఇదేం సట పటమయిన ఊరా? ఈ ఊళ్లో ఎట్టా ఈణ్ణి పట్టుకోబోతామో? అని బిడిం బిడింగానే వొస్తి. ఎతకబొయ్యే తీగె కాలికే తగిల్నెట్టు దొరికిపోతివి గదరా నాయాలా? నా ఆయుస్సు పోసుకోని నూరేండ్లు బతకరా!'' అనె.

''బాగుండావా మామా?''

''ఇది బలే తమాసగా ఉండాదే? ఈడు కుమ్మరోణ్ణి పట్టుకోని మామా! గీమా!

అంటా వుండాడే అనుకోబాకండి. ఇప్పుడంటే చదవేస్తే ఉండే మతి పొయ్యింది. ఆ పల్లె కొంపల్లో ఉణ్ణోళ్లు ఉద్దోగాల పేర్తో ఈ టవున్లమింద పడిరి. సైకిలు చెయిన్లు సోడాబుడ్డీలు ఎత్తుకుంద్రి. నువ్వు కాపోడు. నేను కమ్మోడు అని కొట్లుకుంటా వుండారు. ఒకప్పుడు పల్లెల్లో అయితే కమ్మోడు కాపోడు కుమ్మరోడు కూలోడు అనే బేదమే ఉండాది కాదు. కులాన్నెగరదన్ని అందురు ఏదో వొక వరస పెట్టుకోని పిల్చుకుంటా ఉంద్రి. బతుకంటే ఆ పల్లెల్లోనే బతుకు. అని అనుకుంటా ఉంటే-

''ఇంక ఆ పల్లెకొంపల్లో బతికి బాలేదిలేదురా అల్లుడా! కాలు ఎల పెరుక్కోని వచ్చేద్దామని అనుకుంటా ఉండా. ఎందుకైనా మంచిది. నీ సెవల్లోగూడా ఒక మాటేసి పోదామని వస్తిరా!''

''అదేంది మామా అట్టంటా ఉండావే? కుండల కుండే గిరాకీ యిప్పుడు దేని కుండాది? ఇద్దో యిట్టాచూడు. ఇప్పుడే కొనుక్కుణ్ణా. ఈ కడవ ఏడు రూపాయిలు!''

''ఏడు రూపాయిలు అంటా ఉండావే గానీ ఆ ఏడు రూపాయిలు ఎత్తుకోని అంగిడికి పోతే సంచి నిండదని ఆలోచిస్తా ఉండావా? దరలు ఎట్టా అగ్గిబడిపోతా ఉండాయో నీకు తెల్దా? అయినా ఈ మట్టి కుండల యాపాడం నాలుగు దినాల బోగోతమేగదా? ఈడకత ఆడికి యిడ్సి పెట్రా అల్లుడా. ఆడికొచ్చి ఆ పల్లె కొంపల్లో చూడు. సాగినోడు స్టీలు పాతర్లు కొనుక్కుంటే సాగనోడు సత్తువి తెచ్చుకుండా ఉండాడే కానీ కుమ్మరోడి మొకం చూసే కుండాకోర్ ఎవుడుండాడు? పోనీ రైతులన్నా వాసాలకంగా బతకతావుంటే మా మాదిర చెడిపాయ్‌నోళ్లను చేరదీసేది వాళ్లకొక లెక్కలోది కాదు. వాళ్ల కతలుగూడా ఆడికి అందక ఈడికి చాలక అల్లాటమే? ఇంక మా బోటోళ్లంతా పాయ్ వాళ్ల నెత్తిన పడ్తే ఎట్రా? నీకు తెలవనిది ఏముండాది? ఒకప్పుడు అది పూలమ్మిన చోటు గదా? ఇప్పుడు అడ ఎట్టా కట్టెలమ్మ మంటావురా?''

నిదానించి చూస్తే అప్పుడు గెవనించినా పుల్లన్న మామ పుల్లమాదిర్తో అయిపొయ్యుండాడు!

నేను చెప్పకనే పుల్లన్న మావ కడవెత్తి చేతపట్టుకుండె.

''పదరా అల్లుడా పద!'' అనె.

ముందు నేను ఎనకు పుల్లన్న మామగా ఎలబార్తిమి. గాందీరోడ్లో వస్తావుండాం. నా మణుసు ఎట్టపొయ్యిందో? ఎప్పుడు పొయ్యిందో! నేరుగా గెంటాణ పల్లికి పొయ్యింది. గెంటాణ పల్లిలో కుమ్మర పుల్లన్న యింటి ముందర వాలింది.

అప్పుడు నేను బుడంకాయంత పిలగాణ్ణి. పిలకాయిలు గోలీలాట ఆడుకుంటారు గదా? ఆ గోలీలు బంక మట్టితో చేసుకుంటారు. ఆ మట్టి కోసరం అప్పుడప్పుడు నేను పుల్లన్న మామ యింటికాడికి పొయ్యేటోణ్ణి.

అప్పుడు చూడాల ఆ యింటి ముందర! -

పుల్లన్న మామ పెండ్లాం చీర మోకాళ్ల పైకి ఎగజెక్కి సెక సెక బంక మట్టి తొక్కతా వుంటింది. సారెమింద కట్టేసి గిర్‌మని తిప్పతా పుల్లన్న మామ రకరకాల కుండలు సెణాలమింద చేసి పెట్తా ఉంటాడు. పుల్లన్న బామార్దులు యిద్దరు తటిక్ తటిక్ మని తట్తా కుండల్ను సరిచేస్తా ఉంటారు.

మట్టి కుండలుగా మార్తావుంటే వాళ్ల గుండి కాయిల్లో పూసిన పూలు కండ్లల్లో రాల్తా వుంటాయి!

ఇంక ఎండే కుండలు ఎండతావుంటే... వామిలో కాలేకుండలు కాల్తావుంటే... మరీ పుల్లన్న మామ కట్టేసి సారె జోరుగా తిప్పతావుంటే... సారె మింద బంక మట్టి మామ చెప్పినట్టు యింటావుంటే– చూసినంత సేపు చూడాలనిపిస్తా ఉండేది..

ఇంక ఊళ్లో వాళ్ల కతంటారా? –

''పుల్లన్నా పుల్లన్నా! పిల్లనాబట్ట! వాడి దూము వాడికి దగల. బంగరట్టా పాలకుండ. ఎంత బాగ మాగిందీ ఏం కత? పగలగొట్టేసెనే! మంచిదిగా చూసి ఒక కుండ యిరాదా?'' అని అయినేరోళ్ల ఆడ పడుచు అడగతా ఉంటే–

''పుల్లిగా పుల్లిగా! పులగూర పోసుకోను చట్టిపిడత తుర్రాగా లేదురా! ఎన్నాళ్లుగా అడగతావుండా. పోనీ! ఎట్టా అడగాల్నో చెప్పరాదంత్రా. వక్కాకు బెట్టి అడగమంటావా?'' అని తోపోళ్ల చెంగమ్మత్త దబాయిస్తా ఉంటే–

ఇంకొకరు దొంతికి కడవలు కావాలంటే–

ఆ యింటి ముందర ఒక జాతర జరిగినట్టుండేది!

మరీ పెండ్లిండ్ల సీజన్ వచ్చేసిందంటే పుల్లన్న మామ పని కూడూ కూరా.

ఇప్పుడంటే తూ డబ్ డబ్ అని బొట్టుకట్టేస్తా ఉండారు. కానీ నూరేండ్ల పంట అంటే మాటలా? – వరస బెట్టి మూడు దినాల పొడగనా చేస్తా ఉండ్రి గదా!

ఆ పెండ్లికి ఏముండి ఏమి లేకుండా పాయ్‌నా అరిమేను కుండలు అగిత్తెంగా ఉండాల్సిందే. అంతకు ముందే పెండ్లికి మాటా పలుకు కుదురుతుంది. నిచ్చితార్థం జరిగితింది. ఎంబడే పుల్లన్న మామకు వక్కాకు పెట్టాల్సిందే. అరిమేను కుండలకు ఆర్డరు యియ్యాల్సిందే!

మరీ పెండ్లి నాటికి ఆ కుండలు ఎట్టా తెస్తారనుకున్నారు?

ఈడ పెండ్లింటోళ్లు పొండూ పలారాలు గంగాళంనిండా తట్టల కెత్తుకోని ముత్తయిదులు మేలతాళాల్తో ఎలబార్తారు. ఆడ పుల్లన్న మామ యింటి వాకిట్లో అరిమేను కుండల్ను సైజువారీగా సోలుపుగా పర్సి పెట్టేస్తాడు. మేళతాళాల్తో పెండ్లోళ్లు పుల్లన్న మామ యింటి కాడికి చేరుకుంటారు. తెచ్చిన పొండూ పలారాలు అరిమేను కుండల ముందర పెట్తారు. దచ్చిన పెడ్తారు. కర్పూరం ముట్టించి ఆరతులిస్తారు. అప్పుడు ఆడోళ్లు ఆ

కుండల్ను నెత్తి కెత్తుకుంటారు. మేళ తాళాలు ముందుగా పోతావుంటే... నెత్తిన రంగురంగుల అరిమేను కుండల్తో ముత్తయిదులు కొత్త పెండ్లి కూతర్ల మాదిర కులకతా నడస్తా ఉంటే-

అప్పుడు చూడాల పుల్లన్నమామను!

లచ్చులు గంపలకెత్తి పెండ్లింటికి సాగనంపినట్టు మణిసి ఉబ్బిపోతా ఉంటాడు. అట్టా బతికిన మణిసి యిప్పుడా ఊళ్లో బతకలేనంటా ఉండాడు. నిజిమేగదా? రైతే బతకలేనంటా ఉంటే వాళ్ల దాపన బతికేవాళ్లు ఎట్ల బతకపోతార్లే? అని చింతన జేసుకుంటా ఆ నాలుగ్గాళ్లమండపం కాడికొచ్చేకుందికి ముత్తారెడ్డన్న అడ్డపడె!

''ఏమిరా అబ్బోడా కత?'' అంటే పుల్లన్నమామ కత చెప్తి.

ఆయాళకాడ నాలుగ్గాళ్లమండపం దోవన ఒక పీనిగె ఎలబారిపోతా ఉండాది. ఒక గుంపు దాని ఎంటపడి పాడిపాడి యాడస్తా పోతా ఉండారు. అది చూస్తా ముత్తారెడ్డన్న ఒక ఎర్రి నవ్వు నవ్వె!

''నీకంతా నవ్వులాటగా ఉండాది గదన్నా?'' అంటే-

''ఒరే అబ్బోడా! పుల్లన్న చేతిలో వుండే కుండను పుల్లన్న చేసినాడు. ఇద్దో యిప్పుడు పగిలి పొయ్యిందని పాడి పాడి యాడస్తా ఉండారే ఆ కుండను గూడా ఎవుడో ఒక ఎల్లన్న చేసినాడు. ఎప్పుడో ఒకప్పుడు అదీ పగిలిపోతింది. ఇదీ పగిలిపోతింది. అందుకని వాళ్లేడుపు వాళ్లది. పుల్లన్న ఏడుపు పుల్లన్నది. ఒకరి ఏడుపుతో ఒకరికి పనేలే. ఈఒణ్ణే గాదురా నువ్వు యాడ చూసినా అంతే! ఈ లోకంలో ఒకరి ఏడుపుతో ఒకరికి పనేలే. ఒకరి ఏడుపును యింకొకరు పట్టించు కుండేటట్టుగా ఉంటే ఈ ఏడుపంతా ఎందుకు?''

ఆయన్న శానా తెలివిగా బతుకుసారాన్ని యాదంత సారానికి ముడేసె!

*పోతదీ పగిలీ పోతదీ*

*ఈ మట్టికుండా*

*చెప్పకుండా చెందకుండా*

*పోతదీ పగిలీ పోతదీ!-*

అని నేను ఎప్పుడో ఏడ్సింది మల్లా ఏడుపుగానే మిగిలె! ●